క్లుప్తంగా

డ్రాపౌట్స్‌ను గుర్తించండి

రేగిడి: డ్రాపౌట్స్(గతంలో పాఠశాలకు వచ్చి, ప్రస్తుతం పాఠశాలకు వెళ్లకుండా ఆరుబయట ఉన్న విద్యార్థులు)ను గుర్తించి, పాఠశాలకు వారు మళ్లీ వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవో–2 బి.ఎరకయ్య సూచించారు. మండలంలోని రేగిడి, ఆమదాలవలస, కొత్తచెలికానివలస, పాతచెలికానివలస గ్రామాల్లోని పాఠశాలలను గురువారం సందర్శించిన ఆయన.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం తగ్గకుండా చూడాలని, పిల్లలకు అందించే మధ్యాహ్న భోజనం రుచి, శుచి కలిగి ఉండేలా చూడాలన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

రాజాం: నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంఈవో–2 యాగాటి దుర్గారావు సూచించారు. మండలంలోని గురవాం గ్రామంలోని కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)లో నాడు–నేడు పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన గురువారం పరిశీలించారు. అర్ధాంతరంగా ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనులు వేగంగా పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని ఎస్‌వో సావిత్రికి తెలిపారు.

పచ్చిరొట్టతో భూసారం

రాజాం సిటీ: పచ్చిరొట్ట విత్తనాలు వేసి, ఆ మొక్కలు పెంపకం ద్వారా భూసారం వృద్ధి చెందుతుందని ఏవో ఎం.రేణుకాసాయి తెలిపారు. మండల పరిధిలోని అంతకాపల్లి గ్రామంలో రైతులు చేస్తున్న జీలుగ సాగును ఆమె గురువారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులంతా పచ్చిరొట్ట సాగు చేసుకుని, వాటిని అదే నేలలో దున్నితే నేల సారవంతమవుతుందన్నారు. అలాగే పంటకు కావాల్సిన పోషకాలు అదే నేల నుంచి అందుతాయన్నారు.

వర్షంతో ఉపశమనం

వంగర: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం వర్షం కురిసింది. ఉదయం నుంచి మేఘావృతం కాగా మధ్యాహ్నం చిరుజల్లులుతో కూడిన వర్షం పడింది. ఇన్నాళ్లు ఎండల కారణంగా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు ఈ వర్షంతో ఏర్పడిన చల్లని వాతావరణం కాస్త ఉపశమనం కలిగించింది. ఈ వర్షం వ్యవసాయ పనులకు కూడా అనుకూలమని రైతులు చెబుతున్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

రేగిడి: స్వయం శక్తి సంఘాల మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని ఏపీఎం గోవిందరావు సభ్యులకు సూచించారు. మండలంలోని గోపింపేట, ఖండ్యాం, అక్కన్నఅగ్రహారం తదితర గ్రామాల్లోని స్వయం శక్తి సంఘాల మహిళలతో గురువారం సమావేశమైన ఆయన.. ప్రతినెలా క్రమం తప్పకుండా మహిళలు రుణాల చెల్లింపులు చేయాలన్నారు. సమావేశాలు ఎప్పటికప్పుడు నిర్వహించుకుని, సంఘాల అభివృద్ధికి కృషిచేయాలని కోరారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళన

బొబ్బిలి: పట్టణంలోని చైతన్య, నారాయణ కళాశాలల వద్ద ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తలు గురువారం ఆందోళనకు దిగారు. నిబంధనలు అతిక్రమిస్తూ ఆయా కళాశాలల్లో పుస్తకాల విక్రయాలు, ఫీజుల వసూళ్లు జరుగుతున్నాయని ఆరోపించారు. పట్టణంలోని చైతన్య కళాశాలకు సంబంధించి, భవనమే లేకుండా తరగతులు నిర్వహించడం నిబంధనలకు వ్యతిరేకం కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి మణికుమార్, కిరణ్, సాయిమణి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

భైరిసాగరం ఆక్రమణలను అడ్డుకోవాలి

బొబ్బిలి: పట్టణంలోని భైరిసాగరం ఆక్రమణలను రెవెన్యూ అధికారులు అడ్డుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ.. భైరిసాగరం చెరువుతో పాటు కోటి చెరువు, మున్సిపల్ చెరువులను సర్వేచేసి వాటి విస్తీర్ణాలను ప్రజలకు తెలియజేయాలని అన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, బిల్డింగ్ ప్లాన్ అధికారులు మామూళ్లకు అలవాటు పడి అడ్డగోలుగా అనుమతులు ఇచ్చి అక్రమాలకు తెర లేపుతున్నారని ఆరోపించారు. దీన్ని అరికట్టాలని కోరారు. బఫర్ జోన్‌లోని ప్రాంతంలో చర్చి నిర్మాణానికి ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. మున్సిపల్ అధికారులు ఇటువంటి అవినీతికి పాల్పడటం వల్ల అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఆక్రమణలపై వెంటనే చర్యలు తీసుకోకపోతే తాము ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాసరావు, వై.బాబ్జీ తదితరులున్నారు.

సకాలంలో రేషన్ పంపిణీ

బాడంగి: సకాలంలో రేషన్ సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ ఎస్.రాజారావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని రేషన్‌షాపుల డీలర్లతో గురువారం సమావేశమైన ఆయన.. వీలైనంత త్వరగా రేషన్ పంపిణీ పూర్తి చేయాలని తెలిపారు. సీఎస్‌డీటీ స్వర్ణలత మాట్లాడుతూ ప్రస్తుతానికి పీడీఎస్ బియ్యం మాత్రమే తెర్లాం ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు వచ్చాయని, డీడీలు చెల్లించి, రేషన్ సరుకులు విడిపించుకోవాలన్నారు. టన్ను బియ్యం దగ్గర 50 నుంచి 100 కిలోల వరకు తరుగు వస్తోందని, తాము నష్టపోతున్నామని డీలర్లు తెలిపారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

- కాలువల్లోని మురుగు, వీధుల్లోని చెత్తాచెదారం తొలగింపు
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారుల చర్యలు



రాజాం: అండర్ డ్రైనేజీలో మురుగును తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

తెర్లాం: మండలంలోని చీకటిపేట, కూనాయవలస తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో వీధికాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలు, పూడికలను తొలగిస్తున్నారు. అందులో భాగంగా గురువారం ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం వేతనదారులతో కాలువల్లో పూడికలు తీయించి, తీసిన పూడికలను ట్రాక్టర్ల ద్వారా గ్రామాలకు దూరంగా తరలించి, పోయిస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో వీధి కాలువల్లో వర్షపునీరు నిల్వ ఉండిపోయి దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున పారిశుధ్య పనులు ముమ్మరం చేశామని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్‌లు తెలిపారు.

రాజాం: పట్టణంలోని బొబ్బిలి జంక్షన్ వద్ద గత కొద్దిరోజులుగా నిల్వ ఉండిపోయిన మురుగునీటిని గురువారం తొలగించారు. అండర్ డ్రైనేజీలో ఈ నీరు దిగువకు వెళ్లకుండా ఉండిపోవడంతో స్పందించిన మున్సిపల్ అధికారులు ప్రొక్లెయిన్‌తో డ్రైనేజీ పైకప్పులను తొలగించి, కాలువలోని మురుగు, చెత్తాచెదారం తీసివేసి డంపింగ్‌యార్డుకు



తెర్లాం: చీకటిపేటలో జరుగుతున్న పారిశుధ్య పనులు

తరలించారు. ఈ పనులను మున్సిపాలిటీ ఎన్విరాన్‌మెంటల్ ఏఈ భాగ్యలక్ష్మి పర్యవేక్షించారు.

రేగిడి: ప్రతీ గ్రామంలో తప్పనిసరిగా పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో జి.శ్యామలాకుమారి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన గురువారం సమావేశమై, పంచాయతీల వారీగా జరుగుతున్న పారిశుధ్య పనులపై సమీక్షించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, ఆ దిశగా పంచాయతీ కార్యదర్శులు చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలన్నారు.

పామాయిల్ సాగుపై రైతుల ఆసక్తి



పెనుబాక దగ్గరలో పామాయిల్ తోట సాగు

రాజాం: మండలంలోని రైతులంతా పామాయిల్ తోటల సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుతం పామాయిల్ పంటకు మార్కెట్‌లో డిమాండ్ బాగా ఉండడంతో పామాయిల్ తోటలు పెంచేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. మండలంలోని పెనుబాక, సోపేరు, బొద్దాం, గార్రాజుచీపురుపల్లి తదితర గ్రామాల్లోని రైతులు ఇప్పటికే పామాయిల్ సాగుపై దృష్టిసారించారు. తాజాగా మరికొంతమంది రైతులు ఈ ఏడాది ఆ పంటను సాగుచేసేందుకు ముందుకువచ్చారు. మండలంలో మొత్తం 38 హెక్టార్లలో పామాయిల్ తోటలను రైతులు సాగుచేస్తున్నట్లు వ్యవసాయశాఖ ఏడీఏ చంద్రరావు తెలిపారు. ఈ పంట వేసేందుకు పెట్టుబడి కింద రూ.50 వేలు అవుతుండగా, కొన్నిచోట్ల ఉద్యాన శాఖతో పాటు వెజిటబుల్ ఆయిల్స్ ప్రైవేట్ కంపెనీలు సంయుక్తంగా శతశాతం రాయితీపై మొక్కలు అందజేస్తున్నాయని ఏడీఏ వెల్లడించారు. ఈ పంట పూతదశకు వస్తే ఏడాదికి ఎకరాలో 10 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి



అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిస్తున్న ఐసీడీఎస్ పీవో దశారత్నం

పాలకొండ రూరల్: మూడేళ్ల వయసు దాటిన పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీవో దశారత్నం సూచించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో గురువారం సమావేశమైన ఆమె.. కేంద్రాల వారీగా పిల్లల నమోదు, వారికి అందిస్తున్న విద్య, పౌష్టికాహారం, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహార సామగ్రిపై ఆరాతీశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు రావాల్సిన పిల్లల ఇంటికి వెళ్లి, వారిని కేంద్రాలకు పంపించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు.

పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలి

- ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

బొబ్బిలి రూరల్: ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏ, పీఆర్‌సీ బకాయిలను వెంటనే చెల్లించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడుతో కలిసి గురువారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. పురపాలక, నగరపాలక ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పీఎఫ్ అకౌంట్ నంబర్ కేటాయించాలన్నారు. గత 15 ఏళ్లుగా ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్‌సీ, డీఏ బకాయిలు రూ.500 కోట్ల వరకు ప్రభుత్వ ఖజానాలోనే ఉండిపోయాయన్నారు. ఈ మొత్తాన్ని పీఎఫ్ ఖాతా నంబర్లను కేటాయించి, జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జూలై నెలలో వేలాదిమంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందుతున్నారని, డీఎస్సీ ద్వారా ఖాళీలయ్యే చోట్ల కూడా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూ రేపు

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లిలో ఉన్న తాండ్రపాపారాయ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 29వ తేదీన క్యాంపస్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ తూముల భాస్కరరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. తుని పట్టణంలోని డెక్కన్ కెమికల్స్‌లో ఉద్యోగ నియామకాల కోసం నిర్వహించే ఈ ఇంటర్వ్యూలో బీటెక్, పాలిటెక్నిక్‌లలో 2017–2024 మధ్య మెకానికల్ డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులంతా ఉదయం 10.30 గంటలకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో కళాశాలకు హాజరుకావాలన్నారు.

నిబంధనల ప్రకారం ఎరువులు విక్రయించాలి



పాగిరిలోని ఓ ఎరువుల షాపులో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ చంద్రరావు

రాజాం: నిబంధనల ప్రకారం ఎరువులు విక్రయించాలని వ్యవసాయ శాఖ రాజాం ఏడీఏ కె.చంద్రరావు సూచించారు. మండలంలో పలుచోట్ల ఉన్న ఎరువుల దుకాణాల్లో గురువారం తనిఖీలు చేపట్టిన ఆయన.. స్టాక్ రికార్డులు, ఎరువులు, పురుగుమందు నిల్వలు, ధరల పట్టికలను పరిశీలించారు. అనంతరం వ్యాపారులతో మాట్లాడి, రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువుల విక్రయాలు చేపట్టాలని, అధిక ధరలకు ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి రేనుకాసాయి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయాలి

రేగిడి: బాధ్యతాయుతంగా పనిచేసి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని వైద్యారోగ్య సిబ్బందికి రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ అసిరినాయుడు సూచించారు. మండలంలోని వెంకటాపురం, ఖండ్యాం గ్రామాల్లో గురువారం వైద్యశిబిరం నిర్వహించి, ప్రజలకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, అతిసారం వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటి బారిన ప్రజలు పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు ఆరోగ్యం, పారిశుధ్యంపై అవగాహన కల్పించాలన్నారు.

బీసీజీ వ్యాక్సిన్ వేసుకోవాలి



వైద్యారోగ్య సిబ్బందికి సూచనలిస్తున్న, రాష్ట్ర టీబీ నివారణ అధికారి శశికాంత్

బొబ్బిలి రూరల్: గ్రామాల్లోని 40 ఏళ్ల వయసు దాటిన ప్రతిఒక్కరూ బీసీజీ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేసుకోవాలని రాష్ట్ర టీబీ నివారణ అధికారి శశికాంత్ సూచించారు. మండలంలోని మెట్టవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. టీకా వేయడం, టీకా నిల్వ, టీకా వేసుకున్న తర్వాత వ్యక్తి పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. టీబీ నివారణ కోసం బీసీజీ టీకాలు వేయడం జరుగుతోందని, ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట పిరిడి పీహెచ్‌సీ వైద్యాధికారి వి.ఎస్.కె.రఘువంశీ, సీహెచ్‌వో సరోజిని, హెచ్‌ఏ రామకృష్ణ, ఏఎన్‌ఎం ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ పరిశీలన..



పెరుమాళిలో బీసీజీ టీకాలు వేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

తెర్లాం: మండలంలోని పెరుమాళి, తెర్లాం పీహెచ్‌సీల పరిధిలో బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం చాలా చురుగ్గా జరుగుతోంది. ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ రెడ్డి శ్రీనివాసరావు, వెంకటేష్ ఆదేశాల మేరకు వైద్యారోగ్య సిబ్బంది ఆయా గ్రామాల్లో క్షయవ్యాధి నివారణకు బీసీజీ వ్యాక్సిన్లు వేశారు. ఈ కార్యక్రమాన్ని గురువారం పరిశీలించిన వారు మాట్లాడుతూ క్షయవ్యాధి బారినపడే అవకాశం ఉన్న వారిని గుర్తించి, వారికి బీసీజీ టీకాలు వేస్తున్నామన్నామన్నారు. 60 ఏళ్లు దాటినవారు, బీపీ, సుగర్ ఉన్న వారికి, ధూమపానం చేస్తున్న వారికి టీబీ సోకే అవకాశం ఎక్కువగా ఉందని, అటువంటి వారందరికీ ముందస్తుగా టీకాలు వేస్తున్నామని వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్



ట్యాంకు పరిసరాలను శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ రూప, ఎంపీటీసీ ఆనందరావు

తెర్లాం: మండల కేంద్రమైన తెర్లాంలోని అన్ని మంచినీటి పథకాలను శుభ్రం చేసి, క్లోరినేషన్ చేయిస్తున్నట్లు సర్పంచ్ బోనెల రూప, ఎంపీటీసీ సభ్యుడు జి.ఆనందరావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న రక్షిత మంచినీటి పథకాన్ని గురువారం కార్మికులతో శుభ్రం చేయించారు. ఆ పనులను పరిశీలించారు. రక్షిత పథకం చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను గ్రీన్ అంబాసిడర్లతో తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలంలో మురుగునీరు నిలిచిపోయి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున పారిశుధ్య పనులు చేపడుతున్నామన్నారు. ట్యాంకులను శుభ్రం చేయించి గ్రామస్తులకు సురక్షిత తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పంచాయతీ ఈఓ సూరిబాబు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీరామ్ ఉన్నారు.

భారీ వాహనాల దారి మళ్లింపు



తెర్లాం మీదుగా వస్తున్న భారీ వాహనాలు

తెర్లాం: రాజాం–రామభద్రపురం ఆర్‌అండ్‌బీ రోడ్డులో బాడంగి మీదుగా బొబ్బిలి వైపు వెళ్లాల్సిన భారీ వాహనాలు తెర్లాం జంక్షన్ మీదుగా రాకపోకలు సాగిస్తుండటంతో ప్రజలు, వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వాహనాల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో ఏఎస్సై మల్లేశ్వరరావు, సిబ్బందితో కలిసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. భారీ వాహనాలను బాడంగి జంక్షన్ మీదుగా బొబ్బిలి వెళ్లేలా దారి మళ్లించారు. గతంలో భారీ వాహనాల రాకపోకలతో తెర్లాం రామమందిరం వద్ద, సచివాలయం–1 వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. దాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసులు ముందుగా స్పందించి వాహనాలను తెర్లాం జంక్షన్ నుంచి రామభద్రపురం వైపు మళ్లించారు.

వరిలో వెదజల్లు పద్ధతితో సాగుఖర్చులు ఆదా



రేజేరులో వెదజల్లు పద్ధతిలో సాగుచేస్తున్న వరి పొలాలను పరిశీలిస్తున్న ఏఓ శిరీష

బాడంగి: వరి నాట్లు కోసం దమ్ములు చేసి అధిక వ్యయప్రయాసలు పడేకన్నా వెదజల్లు పద్ధతిలో వరి సాగు చేసుకుంటే ఖర్చులు తగ్గుతాయని మండల వ్యవసాయాధికారి కె.శిరీష అన్నారు. మండలంలోని రేజేరులో రైతులకు వరిసాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై గురువారం అవగాహన కల్పించారు. నాట్లు వేసే పద్ధతిలో నారుమడులు సిద్ధం చేయడం, నారుతీత, పొలాన్ని దమ్ము చేయడం, ఉభాలు వేయడం వంటివి వ్యయప్రయాసలతో కూడుతున్నవని అన్నారు. వెదజల్లు పద్ధతిలో వరిసాగు చాలా సులువైన విధానమన్నారు. ఈ విధానంలో సాగు చేసేవారు కలుపు నివారణలో యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే మంచి దిగుబడులు పొందవచ్చన్నారు. వెదజల్లిన 48 గంటలలో ప్రీటీలాక్లోర్ స్నైఫర్ అనే మందును (600 లేదా 800 మిల్లీలీటర్లు) 200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారీ చేయాలన్నారు. ఫయర్‌జోసెల్ఫ్ యురాన్ ఇథెల్ కలుపు మందును పిచికారీ చేసుకోవాలన్నారు. ఆ సమయంలో పొలంలో పదును బాగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ సాయి కుమార్, రైతులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు విద్యా బోధన చేయాలని ఎంఈఓ జె.త్రినాథరావు అన్నారు. మండలంలోని ఎం.ఆర్ అగ్రహారం ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును, పాఠశాల రికార్డులు, పరిసరాలు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, మధ్యాహ్న భోజన పథకం వంటలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై పాఠశాలలో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి కలిగించేలా బోధన చేయాలని సూచించారు. బడిఈడు పిల్లలు బడిలో చేరేలా వారి తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. గోరుముద్ద పథకం సక్రమంగా అమలు జరిగేలా చూడాలన్నారు. విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్లను పంపిణీ చేయాలని, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు.

సీబీఎం స్కూల్ ఆస్తులు కాపాడండి

బొబ్బిలి: పట్టణంలోని చారిత్రాత్మక సీబీఎం స్కూల్(గరల్స్) ఆస్తులను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు కోరారు. ఆ స్కూల్ సిబ్బంది క్వార్టర్స్ వద్ద గురువారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. కొన్నేళ్ల క్రితం సిబ్బంది క్వార్టర్స్, బాలికల వసతిగృహం స్థలాన్ని అక్రమంగా అమ్మివేసినట్లు కొత్తగా బాధ్యతలు చేపట్టిన కరస్పాండెంట్ విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో తెలిపారన్నారు. ఇలా ఓ స్కూల్‌కు చెందిన స్థలాన్ని ఎలా విక్రయిస్తారని ప్రశ్నించారు. విక్రయించిన వారిపైనా, కొనుగోలు చేసిన వారిపైనా చర్యలు తీసుకోవాలన్నారు. స్కూల్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని, లేకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం, బాడంగి మండల కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



వండానపేట అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న నూకాలమ్మ

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ బూరాడ సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్ నూకాలమ్మ సూచించారు. మండలంలోని వండానపేట, ఉంగరాడమెట్ట, కె.ఎం.వలస తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం సందర్శించిన ఆమె.. ఆయా కేంద్రాల్లోని పౌష్టికాహారం నిల్వలు, వాటి నాణ్యతను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం వారికి సక్రమంగా అందించాలని సూచించారు. చిన్నారుల బరువు, ఎత్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, వారి మెరుగైన ఆరోగ్యానికి చర్యలు తీసుకోవాలన్నారు.

అన్నివార్డులు పరిశుభ్రంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణంలోని అన్నివార్డులు పరిశుభ్రంగా ఉండాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి సిబ్బందికి సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అన్ని సచివాలయాల ఎమినిటీ సెక్రటరీలు, వార్డు శానిటేషన్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలతో గురువారం సమావేశమైన ఆమె.. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, అతిసారం వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటి బారిన ప్రజలు పడకుండా పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయాలన్నారు. ప్రజలకు కూడా ఆరోగ్యం, పారిశుధ్యంపై అవగాహన కల్పించాలన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



బొబ్బిలి రూరల్: మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్



రామభద్రపురం: బూసాయవలసలో రక్షిత మంచినీటి పథకం ఆవరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ



రాజాం సిటీ: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ సూచించారు. మండలంలోని పలు గ్రామాలను ఆమె గురువారం సందర్శించి, అక్కడి మంచినీటి పథకాలు, పాఠశాలలను పరిశీలించారు. ప్రస్తుతం వర్షాకాలంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ జ్వరాలతో పాటు అతిసారం బారిన ప్రజలు పడే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వైద్యారోగ్య సిబ్బంది కూడా ప్రజలకు ఎప్పటికప్పుడు పారిశుధ్యం, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని, ప్రధానంగా ఇంటి ముందు మురుగునీటి నిల్వలు ఉండకుండా చూడాలన్నారు. తడి, పొడి చెత్తలను వేరుచేసి, పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని, కాలువలు, మురుగునీటి ప్రాంతాల వద్ద దోమలు పెరగకుండా దోమల నివారణ మందు పిచికారీ చేయాలన్నారు. అనంతరం బూసాయవలస కస్తూరిబాగాంధీ విద్యాలయాన్ని సందర్శించిన ఆమె.. పాఠశాలలోని వంటగది, ఆవరణలు పరిశీలించి, పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి తెలిపారు. భోజనం చేసే ముందు పిల్లలు చేతులు శుభ్రంగా కడుక్కునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటరమణ, బూసాయవలస పంచాయతీ కార్యదర్శి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని మెట్టవలస గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో పి.రవికుమార్ గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు మలేరియా, డెంగీ, టైఫాయిడ్, అతిసారం వంటి సీజనల్ వ్యాధుల బారినపడకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. మంచినీటి వనరుల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టడంతో పాటు కాలువల్లోని పూడికలు, వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించాలని సర్పంచ్ మాధవను కోరారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లి, అక్కడి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి, చూసి పరిశీలించారు. వంటగది పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, ఆహార పదార్థాలు కూడా రుచికరంగా ఉండాలని, వేడివేడిగా ఉన్నప్పుడే వాటిని విద్యార్థులకు వడ్డించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భాస్కరరావు, పంచాయితీ కార్యదర్శి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: మండలంలోని అన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలతో గురువారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా మలేరియా, డెంగీ, టైఫాయిడ్, అతిసారం వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి, ఆయా వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.